# నా హృదయం

**–బుద్ధి యజ్ఞమూర్తి**

చలం అన్నట్లు ప్రేమలేఖకి ముఖ్యమైన కారణం వియోగమే, విరహమే అని తోస్తోంది. ఊళ్ళో ఉన్నప్పుడు ఒకరినొకరం కలవలేని స్థితిని ఎదుర్కొన్నప్పుడు ఆ వియోగమే కదా తొలిసారిగా నాకు నీ చేత ఉత్తరం రాయించింది. అట్లా ఇప్పటికి ఎన్ని రాసుకున్నాం. అయినా ఈ లేఖలకి అంతమనేది లేదు. ఈ ప్రవాహం ఇట్లా జీవితాంతం సాగుతూనే ఉంటుందనుకుంటాను. వియోగంతో కాలిపోతూ ఇట్లా ప్రేమలేఖలతో సంతృప్తి పొందటమే మన జాతకాల్లో రాసి ఉండి ఉంటుంది.

మూడు రోజుల్నించీ 'డ్యూటీ'కి సెలవు పెట్టాను. చలిజ్వరం కాస్తంత పని ఒత్తిడిని కూడా తట్టుకోలేని నా శరీర దుర్బలత్వం మీద జాలి కలుగుతోంది. అదీగాక ఏ ఆఫీసు గదిలోనో ఫ్యాన్‌కింద కూచుని పని చేసుకుపోయే ఉద్యోగం కాదయె. పగలంతా 'చిక్కటి ఎండ'లో పనివాళ్ళ మీద చిందులు తొక్కే ఉద్యోగమాయె. 'ఎండ' నా ఒంటికి సరి పడదు. అరగంట ఎండలో ఉన్నానంటే ఆ రోజంతా నీరసంగా ఉంటుంది. శాస్త్రవేత్తలు కూడా హెచ్చరిస్తున్నారు– ఈ కాలంలో ఎండలో గడపడం ఆరోగ్యానికి తీవ్రమైన హాని అని. ఎక్స్‌పెక్ట్ చేసిన దానికన్నా ఓజోన్ వేయర్ త్వరితగతిన క్షీణించిపోతోందనీ, ఓజోన్ వల్ల వడకట్టబడుతున్న అతి నీల లోహిత కిరణాలు స్వేచ్ఛగా భూమిని చేరే అవకాశాలు ఎక్కువయినాయని గగ్గోలు పెడుతున్నారు. అదీ భయం.

ఇవేళ ఎండ లేదు. ఏమంటే రాత్రి నుండి విరామం లేకుండా వాన కురుస్తోంది. వాన పడ్తుందంటే చాలును, నీవే జ్ఞాపకమొస్తావు. ఎందుకనో నీకూ తెలుసు. చలిపుడుతుంటే ఇంత జ్వరంలోనూ బజారుకి పోయి సిగరెట్ కొన్నాను. వెలిగించి ఓ దమ్ము పీల్చాను. ఒంట్లో వేడి చొరబడీనట్లు ఫీల్ అయినాను. నేను సిగరెట్లు తాగడం నీవు సహించలేవేమో– అన్పించింది. ''నాకు సిగరెట్లు తాగే అలవాటుంది'' అని మన తొలి కలయికలోనే నేను నీకు చెప్పిన సంగతి జ్ఞాపకమొచ్చింది. అప్పుడు నీవు నా ఈ అలవాటు పట్ల అయిష్టతను కనపరచలేదనేది కూడా జ్ఞాపకముంది. అయినా అలవాటు పట్ల అయిష్టతను కనపరచలేదనేది కూడా జ్ఞాపకముంది. అయినా నీ మనసులో అసంతృప్తి ఉందేమోనని సందేహిస్తున్నాను. నీ ఒక్క కనుసైగ చాలునే నా పెదాల మధ్యనున్న సిగరెట్ నేల మీద పడ్డానికి.

ఇక్కడ మన వూరి వాళ్ళు పరిచయస్తులు ఎంతో మంది నన్ను కలుస్తున్నారు, పోతున్నారు. ఎందుకంటే నేను కొద్దిగానైనా గుర్తింపు పొందిన వ్యక్తిని కనుక. నేను రచయితనే కాకుండా ఉన్నట్లయితే, పత్రికల్లో నా రచనలేమీ పడకుండా ఉన్నట్లయితే 'నేను' ఈ మాత్రం గుర్తింపుకి నోచుకునేవాణ్ణి కాదని గట్టిగా నమ్ముతున్నాను. ఏమీతోచనప్పుడు నేనే పోతున్నాను వాళ్ళ వద్దకి. వాళ్ళు రావడం, నేను పోవడం జరుగుతున్నప్పుడు నీవు రావడం మాత్రం ఎందుకు సంభవించదు? అని ఆలోచిస్తుంటాను అప్పుడప్పుడూ. ఒంటరిగా ఉంటే అసహజమైన ఆలోచనలెన్నో వస్తాయంటానికి నీకు నేనే ఒక ఉదాహరణ.

ఒంటరిగా గదిలో పచార్లు చేస్తున్నాను. నాకేదో కావాలనిపిస్తోంది. అదేమిటో నాకే అంతుచిక్కకుండా ఉంది. ఎవరన్నా వస్తారేమో అన్నట్లు తలుపు వేపు చూస్తాను. ఎవరూ రారు. అసహనంతో కిటికీ దగ్గరకు పోయి నిలబడ్డాను. ఏదో సందేహంతో చప్పున వెనక్కి తిరిగాను. నా కళ్ళు చెదిరి పోయాయి, అంత వెలుతురుని భరించాలంటే. ఆ రూపం అట్లా ఉంది. ఎవరు... ఎవరీ అద్భుత సౌందర్యరాశి... ఎవరీ మెరుపు కన్యా?... నన్ను కరుణించడానికై వచ్చిన దేవకన్యా? అనుకుంటూ కళ్లు విప్పార్చి చూశాను. ఆ వెలుగుని ఇప్పుడు చూడగలిగాను... ఆ రూపం నాకు కొత్త కాదు... ఆ ముఖం అంతకన్నా కొత్తకాదు. అనునిత్యమూ నా హృదయంలో కదలాడుతూ తనేనా ఊపిరియైననీది. ముందునే నువ్వని ఎందుకు గుర్తించలేకపోయాను? నాలో నువ్వు నాకంటే ఎంతో ఉన్నతమైన దానివని బలంగా అనుకుంటో ఉండటం చేత అది ఈ రూపకంగా బయటుపడిందా...? కానీ నువ్వు నాదానివి. నా స్రవంతివి. ''స్రవంతీ!'' అంటూ ఆపుకోలేని ఉద్వేగంతోటి నిన్ను అందుకోవాలని వేగంగా సమీపిస్తే... చిత్రంగా నీవు నాకందడంలేదు. ఎంతసేపో ప్రయత్నించాను. నీవు నాకు చిక్కవు. అట్లా అని మాయమైపోవు. నన్ను ఊరిస్తూ... అట్లానే నన్ను దూరంగా ఉంచుతూ... నాకు తల తిరిగిపోతోంది. నాకేదో ఐపోతోంది. 'నేను' నేను కాక మరెవరినో ఐపోతున్నాననిపిస్తోంది...




చప్పున కల మాయమైంది. దిగ్గున లేచి కూర్చున్నాను. అలసిపోయినట్లే రొప్పుతున్నాను. ఏమిటిట్లాంటి కల వచ్చింది? నాలో సగమైన, నా హృదయానికి అర్ధాంగి అయిన నీవు కలలో దర్శనమిచ్చావన్న ఆనందం అంతా తృటిలో మాయమయ్యింది. నీవు అట్లా నాకు అందకుండా పోవడం... నా లోపల ఉన్న భీరుత్వానికి చిహ్నమా? అనిపించింది.

అయితే ఈమారు అక్కడికి వచ్చేసరికి మునుపటి వ్యక్తిలాగా మాత్రం ఉండను. అప్పుడు నన్ను చూసి నువ్వే ఆశ్చర్యపోతావు. అన్ని భయాలకీ, ఎన్నో సందేహాలకీ అతీతంగా నన్నెవరూ నిందించ సాహసించడానికి ప్రయత్నించలేని విధంగా తయారయి వస్తాను. అందాకా ఓపిక పట్టు.

ఇక్కడికి వచ్చేముందు ''ఒక్క ముద్దు అయినా'' అంటే ''అప్పుడే ముద్దుదాకా వచ్చావా!'' అన్నావు. ఇప్పుడు అదే నువ్వు ''ఎన్ని ముద్దులయినా'' అంటుంటే గొప్ప పులకరింతలతోటి ఒళ్ళు ఊగిపోతోంది.

కనీసం నీ చేతి స్పర్శకైనా నోచుకోని నేను ఒక్కసారిగా ముద్దు పెట్టాలంటే... నా కలం సయితం మొహమాటపడ్తోంది. రాయడానికి నిన్ను– నా హృదయంలోని రూపాన్ని– ముద్దు పెట్టుకున్నాను. ...నా 'ముద్దు' పెదాల స్పర్శ సోకిన

నీ 'ముద్దు' పెదాలు వణికాయి. నీ కళ్ళు 'ముద్దు' ఇచ్చిన 'మత్తు'కి లొంగిపోయి సోలిపోయాయి. నీ ఒళ్ళు నయితం కంపిస్తోంది. ఊపిరికి మెడకింది మెత్తని, గుండ్రనైన... పైకి కిందికీ... ఇట్లా ఊహించుకుంటున్నాను నిన్ను. ఊహాలకి హద్దులనేవి లేవు కదా!

ఇప్పుడు మరీ నీవే కావాలనిపిస్తున్నావు. ఏం ఉపయోగం? మన మధ్య ఎన్ని యోజనాల దూరం ఉందో? నిన్నందుకోవాలంటే ఎన్ని యుగాలు భరాయించాల్సి ఉందో? అప్పటికయినా మన కలయిక నిజమౌతుందంటావా?

ఈ ఉద్యోగంలో చేరాక నా హృదయం నెమ్మదిగా తన సహజత్వాన్ని కోల్పోయి స్పందన లేనంతగా మారిపోతుందేమోనని భయం కలుగుతోంది. ఈ మెంటల్ టెన్షన్స్, మనశ్శాంతినివ్వని ఈ ఉరుకులు– పరుగులు వదిలేసి కేవలం... కేవలం నిన్ను తలచుకుంటూ, నీవిచ్చిన ఇన్‌స్పిరేషన్‌తో కథలు రాసేస్తో బతికేయాలనిపిస్తోంది కానీ లోకం నన్నట్లా ఉండనీయదు. నన్ను నా మానాన తృప్తిగా బతకనిస్తే దాని అస్తిత్వం సంగతేమిటి? తను ఉన్నానని అనుక్షణమూ నాకు గుర్తు చేయ్యాలని దానికి ఉబలాటం. పూర్తిగా లొంగకా, ఎదిరించకా ఊగిసలాడుతున్నాను. కానీ ప్రేమకి అపజయం అనేది లేదు. ఏనాటికైనా నేను నెగ్గుతాననే గొప్ప ఆశతోటి రోజులు నెట్టుకొస్తున్నాను.

ఎన్నో అడ్డంకులు కల్పించవచ్చు మనకి లోకం, ఎంతగానో బాధించవచ్చు. అయినా చలించక ఒక్కటువ్వడం కోసం నిరంతరం పోరాడుతుండటమే మనకున్న ఒకే ఒక మార్గం, లక్ష్యం కూడా.

తిరగబడ్డం అనేది నా రక్తంలోనే ఉందనిపిస్తోంది. లేకపోతే అందరికీ ఎందుకు వ్యతిరేకినవుతాను? నాకు నయించని పనులు చెప్పి, అవి నేను చేయకుండా ఉంటే... అందులో నా తప్పేం ఉందో అర్ధం కాదు.

ఉత్తరాల్లో అమ్మ రాస్తుంది– ఉదయం, సాయంత్రం దేవుడికి పూజ చేస్తుండమని నేను చేయనని ఆమెకు తెలిసీ రాస్తుంది. ఎప్పటికైనా తన మాట నేను వినకపోతానా అని ఆశ కావచ్చు. దేవుడికి పూజ చేస్తే ఏం ఉపయోగం ఉంటుందో ఇంతదాకా అనుభవంలోకి రాక పోవడం చేత, ఆ పూజల్లో నాకు నమ్మకం కలగలేదు. చిన్నతనంలో సంగతి వేరు. వాటిల్లో అంత మహిమే కనక ఉంటే మా కుటుంబ ఆర్థిక స్థితి మునుపటికన్నా అస్తవ్యస్తంగా ఎందుకు తయారవుతుంది? ఈ పూజలూ, పునస్కారాలకి నేను విరోధినవ్వడానికి ఇదొక్కటే కారణం కాదు. నిజానికి ఇది కారణమే కాదు.

ఈ విషయంలోనే కాక మరెన్నో విషయాల్లో అమ్మకీ, నాకూ చుక్కెదురుగానే ఉంటోంది. 'అమ్మ చెప్పినట్లు విని ఆమెని సంతోషపరిస్తే చాలదా?' అని అప్పుడప్పుడూ అనిపిస్తుంటుంది. అందుకు ఆత్మకు తృప్తి కలుగుతుందేమోగాని హృదయానికి శాంతి కరువవుతుంది. మనసుకి విరుద్ధంగా నడచుకోలేక కాళ్ళ దగ్గరకి వచ్చిన ఉద్యోగావకాశాల్నే కాలదన్నుకున్న ఈ మూర్ఖుడికి (జనం దృష్టిలో) హృదయమే ముఖ్యం కాని అనుక్షణమూ రాజీపడ్డం చేతకాకుండా వుంది.

ఇందుచేతనే నిన్ను సాధించుకోగలననే నమ్మకం గట్టిగా ఏర్పడింది. అందరు ఆడపిల్లల్లాగా కాకుండా నా గురించి ధైర్యంగా మీ వాళ్ళకి చెప్పగలిగిన నిన్ను వదులుకుని ఎట్లా బతగ్గలను? నా చేతకాదు.

త్వరలోనే వస్తాను నీ దగ్గరకి. మా వాళ్ళని ఒప్పించినాకే నీతో తొలిముద్దు పెట్టించుకుంటాను. నీ ముద్దుకోసం ఈ పెదాలెంత ఆత్రపడుతున్నాయో! ఆ భాగ్యం నాకు కలుగుతుంది కదూ!?

---

# కరాటే పుట్టుక

ఆత్మరక్షణ కోసం, మానసిక, దైహిక ఆరోగ్యం, మరుకుదనం మొదలైన వాటిని పొందాలంటే అనువైనది కరాటే. ఇది జపాన్‌కు దక్షిణాన వున్న రియూక్యూ అనే ద్వీపంలో ఆవిర్భవించిందని చెబుతారు.

సుమారు 1400 సం. క్రితం ఒక బౌద్ధ భిక్షువు దక్షిణ భారతాన్ని వదిలి బౌద్ధ ధర్మ ప్రచార నిమిత్తం చైనా పయనమయ్యాడు. ఆ రోజుల్లో యాత్రచేయడానికి నానా యాతనలు పడాల్సి వచ్చేది గనుక ఆత్మరక్షణకోసం బౌద్ధవిద్యతో "ఎక్కీ న్" అనే ఒక సూత్రాన్ని కంఠోపాఠం చేసాడు. దుష్టశక్తుల నుండి కాపాడటమే ఈ సూత్రం యొక్క పరమార్థం. తదనంతరం ఇది కళగా రూపొంది శౌరిన్ జి అను పేర వ్యాప్తిగాంచింది. అలా అది రియూక్యూ అనే ద్వీపం వరకు విస్తరించి అక్కడ "ఒకినావతె" గా మార్పుబడి కొన్ని శతాబ్దాల వరకు కళగా ప్రాచుర్యం నొందింది. ఆ ద్వీప పరిసర ప్రాంతాలలో దీన్ని "టోటే" గా వ్యవహరించెడివారు.

1421 సం.లో రియూక్యూ ద్వీపానికి సోహో షి రాజుగా నియమితుడైనాడు. తన ప్రజల వద్ద రక్షణ కోసం ఆయుధాలను ఉంచుకోవటం నిషేధం అని ఆజ్ఞలు జారి చేసాడు. మరే ఇతర స్వరక్ష పద్ధతులను కూడ అవలంబించ వీలులేకుండా ఆదేశాలు జారి చేశాడు. పర్యవసానంగా "ఒకినావతె" ను రహస్యంగ అభ్యసించెడివారు. 1867లో నేటి ఆధునిక కరాటెకు పితామహుడైన "గిచిన్ ఫునాకోషి" అదే ద్వీపంలో జన్మించాడు. లేత వయసులోనే గిచిన్ ఒకినావతె విద్యలో ఆరితేరి, "మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఒకినావ" అనే సంస్థను ఏర్పాటు చేసాడు. 1921 సం.లో జపాన్ లో జూడో ను ప్రవేశపెట్టిన ప్రొజుగారో గానో ను కలిసి గిచిన్ తన ద్వీపంలో ప్రాముర్యం పొందిన ఒకినావతె కళ గురించి వివరించాడు.

ఆయన సలహా మేరకు ఒకినావతె కరాటేగా పేరు మార్పుబడింది. "కరా అంటే రిక్త అని టె అంటే హస్తాలు" అని భావం రెండు కలిపితే ఆయుధాల ఆవశ్యకత లేకుండా స్వరక్షణ చేసుకొనే వాడే కరాటే వీరుడని అర్థం అలా పుట్టిన కరాటే నేడు విశ్వవ్యాప్తంగా బహుళ ప్రాముర్యం పొంది యువతి, యువకులంతా ఆసక్తితో అభ్యసిస్తున్నారు. మన దేశానికి సంబంధించినంతవరకు న్యూఢిల్లీ 1986లో కార్యాలయాన్ని ఏర్పాటు చేసారు. అంతర్జాతీయ స్థాయిలో దీని ప్రధాన కేంద్రం న్యూయార్క్‌లో వుంది.

—అన్వేషి